

కథా కౌముది

చేతన

సి.హెచ్.క్రాంతి

మేధ ఈ మధ్యే బి.టెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో "శోధన" కంపెనీలో డేటా ఎనలిస్ట్ ఉద్యోగంలో చేరింది. మొదటి ఉద్యోగమేమో ఆఫీస్, టీం వాతావరణమంతా క్రొత్తగా ఉంది. వాళ్ళ టీంలో తను మాత్రమే ఫ్రెషర్, మిగిలిన వాళ్ళందరూ అయిదేళ్లకంటే ఎక్కువ అనుభవం ఉన్న వాళ్ళు. మేనేజర్, మిగిలిన కొలీగ్స్ మధ్యలో కాఫీకి, టీకి, భోజనానికి కలుపుకుని తీసుకువెళుతున్నా, ఇంకా బెరుగ్గానే ఉంటోంది మేధకి.

అన్ని యంత్రాల మధ్య పనిలో మునిగిపోయిన ఈ మనుష్యులు కూడా యంత్రాల్లాగా అనిపిస్తున్నారు. అందరూ మంచివారు, సహాయపడే వారే కానీ, ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయి ఉంటారు. ఇలా కాసేపు బయటకి వచ్చినప్పుడు మాత్రం బాగా స్నేహంగా పలకరిస్తారు కానీ, మిగిలిన సమయమంతా పలకరిద్దామని ప్రయత్నించినా హడావిడిగా సమాధానం చెప్పి వెళ్ళిపోతారు. కానీ మనసు విప్పి మాట్లాడుతున్నట్లుండేది కాదు, అదంతా ఇబ్బందిగా ఉండేది మేధకు. తన కాలేజి స్నేహితులు గుర్తొచ్చి అప్పుడప్పుడూ బాధ పడుతూ ఉండేది.

మేధ చేరిన కొన్ని రోజులకి వాళ్ళ మేనేజర్ చేతనని తీసుకొచ్చి వాళ్ళ టీంకి పరిచయం చేశారు. చేతన ఇప్పటివరకూ వాళ్ళ ప్రక్కటీంలో పని చేసేదని, ఆ ప్రాజెక్ట్ అయిపోవడంతో తమ ప్రాజెక్ట్‌లోకి వచ్చిందని చెప్పారు. చేతనకి ఈ టీం పని తెలియకపోయినా సాధారణ కోడింగ్, డేటాబేస్‌ల మీద అనుభవం ఉంది. దాంతో మేధ, చేతన ఒకరికొకరు సహాయం చేసుకోవడం మొదలయ్యింది. మొదట్లో రోజులో కొద్దిసేపు మాత్రమే మేధ, చేతనతో తమ పని గురించి మాట్లాడేది.

ఒకరోజు మేధ, వాళ్ళ కొలీగ్ కార్తీక్ రివ్యూ చేయమని ఇచ్చిన కోడ్‌ని జాగ్రత్తగా పరిశీలిస్తోంది. అంతా బానే ఉన్నట్లుంది కానీ ఎక్కడో ఏదో తప్పుగా అనిపిస్తోంది, అయితే అది ఎక్కడనేది అర్థం కావట్లేదు. సాయంత్రందాకా కుస్తీ పడి ఇంటికి వెళ్ళేముందు చేతనతో ఈ మాటే అంది. దానికి చేతన, "ఏదీ ఒకసారి నాక్కూడా చూపించు" అంది. చూసిన వెంటనే చేతనకి సమస్య అర్థమయ్యి, "నీ అనుమానం నిజమే మేధ, ఇదిగో ఇక్కడ ఈ లూప్‌లో తప్పుంది. కొన్ని సందర్భాలలో ఇది బ్రేక్ అవకుండా కోడ్‌ని క్రాష్ చేసే ప్రమాదం ఉంది, బాగా ఆలోచించావు, వెంటనే కార్తీక్‌కి చెప్పు" అంది.

అప్పటినుండి చేతన మీద ఎంత నమ్మకం పెరిగిందంటే, ఏ సందేహం వచ్చినా, గూగుల్లో వెతికినా చేతనతో మళ్ళీ సంప్రదించేంత! ఇంకోసారి మేధ వాళ్ళ మేనేజర్ ఇంటికి వెళ్ళేముందు ఆపి, "ఈ ప్రాజెక్ట్ రిపోర్ట్ మనం రేప్రొద్దున కల్లా క్లైంట్‌కి పంపించాలి, ఎంత ఆలస్యమయినా పని పూర్తి చేసి కానీ ఇంటికి వెళ్ళద్దన్నారు." దిగులుగా చేతనతో ఆ మాటే అంటే, చకచకా ఆ రిపోర్ట్‌కి అవసరమైనవన్నీ వివరంగా చెప్పి అవన్ని ఒక్కొక్కటిగా పూర్తి చేయించింది.

అది చూసి మేధ, "అబ్బ చేతన, ఎంత సహాయం చేశావు! ఆఫుమేఘాలమీద ఇంత పని చేసినా నీకు కొంచెం కూడా అలసట రాలేదు" అంటే నవ్వేసింది చేతన.

నిజానికి చేతనకి ఇలాంటివి మామూలే అని తెలిసినా, మేధకి మాత్రం చాలారోజుల తరువాత తన కాలేజీ స్నేహితులతో ఉన్నంత సరదాగ, దగ్గరగ అనిపించింది.

ఆ తరువాత కూడా ఇలాంటివి కొన్ని సంఘటనలు జరిగాయి. ఒకసారి మేధ తను క్లైంట్‌కి పంపించిన కోడ్‌లో తప్పులున్నట్లు తరువాత గమనించింది. వెంటనే వెళ్ళి మేనేజర్‌కి చెబుదామంటే భయంగా అనిపించి చేతనతో అంటే, చేతన ధైర్యం చెప్పి మేనేజర్‌తో ఎలా మాట్లాడాలి, అలానే క్లైంట్‌కి ఈ సమస్య వివరిస్తూ చేయాల్సిన మెయిల్ గురించి ఓపిగ్గా చెప్పింది. దానితో చేతన అంటే నమ్మకంతో పాటు గౌరవం కూడా పెరిగింది మేధకి.

ఇలా రాన్రానూ వాళ్ళ మధ్య స్నేహం బాగా పెరిగి, రోజూ ఆఫీస్‌కి రాగానే హాయ్ చెప్పుకోవడం దగ్గరనుండి, సాయంత్రం వెళ్ళేవరకూ ఎక్కువ సమయం ఒకరితోఒకరు గడుపుతూ ఉండేవాళ్ళు. చేతనలో మేధకి బాగా నచ్చిన విషయమేంటంటే, తనకి నచ్చిన విషయం మాట్లాడినంతసేపూ చేతన కూడా దాని గురించి విస్తారంగా మాట్లాడేది. మేధకి చేతన వేసే తిరుగు ప్రశ్నలు నచ్చకపోయినా లేక వేరే విషయం గురించి

మాట్లాడినా, చేతన కూడా వెంటనే విషయం మార్చేసేది, మళ్ళీ పాత విషయాలు మాట్లాడేది కాదు. లేదా ఒక విషయం గురించి రోజుల తరబడి మాట్లాడినా కూడా విసుక్కునేది కాదు, తనకి తెలిసిన విషయాలన్ని పంచుకుంటూ ఉండేది.

మధ్యమధ్యలో మేధ తన కుటుంబం గురించి, ఇతర స్నేహితుల గురించి కూడా చేతనకి చెప్పుకునేది. అయితే మేధ గురించిన ఏ విషయాలు చేతన వాళ్ళ మిగిలిన టీంతో పంచుకోకపోవడం వల్ల కూడా మేధకి చేతన అంటే బాగా ఇష్టం ఏర్పడింది.

ఇది ఇలా జరుగుతుండగా, ఒక రోజు వాళ్ళ మేనేజర్ వచ్చి ఐటి టీం వాళ్ళు చేతనతో కలిసి ఒక కేస్‌స్టడీ చేస్తున్నారని, మన ప్రాజెక్ట్ పనుల్లో చేతన సహాయం చేయలేదని చెప్పారు. ఆ స్టడీ నాలుగురోజుల్లోనే పూర్తయినా మేధకి మాత్రం నాలుగు నెలలన్నట్లు అనిపించి, దాదాపు పిచ్చెక్కినంత పనైంది.

ఇంతలో వాళ్ళ బెంగుళూరు హెడ్డాఫీస్ నుండి ఒక టీం వచ్చింది. ఇక్కడున్న అందరూ వాళ్ళ పనులన్నింటి గురించి ప్రతి టీంకి ఒకరు చొప్పున మాట్లాడాలని చెప్పారు. మేధ టీం తరపున తననే మాట్లాడమన్నారు. దాంతో ఆ సమావేశానికి అవసరమైన అంశాలు తయారు చేసుకుంటూ కొన్ని సందేహాలు వస్తే చేతనతో మాట్లాడుతూ నివృత్తి చేసుకుంటోంది.

మామూలుగా కంటే ఈ రోజు మేధ పని ఎంత తొందరగా పూర్తి చేసుకుందామనుకుంటుంటే, చేతన ప్రతిదానికి సాగదీస్తున్నట్లనిపించి, "ఇలా కాదు అవసరమైనంత వరకూ ఇవ్వు చాలు" అని చెప్పి చూసింది కానీ, చేతన మాట విన్నట్లు కనిపించలేదు. బాగా పని ఒత్తిడిలో ఉండడం వల్ల ఈసారి కాస్త గట్టిగా, "అబ్బబ్బ ఎన్ని సార్లు చెప్పాలి? ఇప్పుడు ఈ సోదంతా ఎందుకు? అడిగిన దానికి మాత్రం చెప్పు చాలు" అని కొంచెం గట్టిగానే విసుక్కుంది మేధ.

"సరే" అంది చేతన. ఆ కాసేపటికి పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళిపోయింది మేధ.

ఆ రోజు పడుకునేటప్పుడనిపించింది మేధకి, తనేమైనా మరీ గట్టిగా మాట్లాడిందా? చేతన బాధపడి ఉంటుందా? అయినా ఎంత హడావిడిగా ఉందో చెబుతూనే ఉన్నాను కదా? పోనీ ఇప్పుడే మాట్లాడదామంటే కుదరదు, ఏమనుకోదేమోలే, రేపు మీటింగ్ అయిపోగానే తీరిగ్గా చేతనతో మాట్లాడదామనుకుని సర్ది చెప్పుకుంది మేధ.

మర్నాడు ప్రెజెంటేషన్ బానే జరిగింది. హెడ్డాఫీసు వాళ్ళ సలహాలు, సూచనలు అన్నీ జాగ్రత్తగా వ్రాసుకుంది. మీటింగ్ నుండి బయటకి రాగానే ముందు చేతనకే చెప్పింది.

చేతన కూడా "గుడ్ మేధ, బాగా మాట్లాడినందుకు కంగ్రాట్స్" అని చెప్పింది.

కానీ మేధకి మాత్రం చేతన ముక్తసరిగా మాట్లాడినట్లనిపించింది. అంతకుముందోసారి మేధ చేసిన ప్రాజెక్ట్ పనికి వాళ్ళ మేనేజర్ అందరిముందు బాగా మెచ్చుకున్నారు, ఆ విషయం చేతనకి చెబితే ఎంత హడావిడి చేసిందో! ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విషయం అని కొన్ని రెస్టారెంట్స్ పేర్లు కూడా చెప్పి, "పార్టీ ఇవ్వు అందరిని పిలిచి" అని కూడా సలహా ఇచ్చింది. ఇప్పుడు జరిగిన మీటింగ్ దానికంటే పెద్ద విషయం అయినా కేవలం కంగ్రాట్స్‌తో ఆపేసింది. మేధకు మనసులో బాగా వెలితిగా అనిపించింది. కానీ ఇంతలో మిగిలిన టీం వాళ్ళు రావడంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

తరువాత రోజు రాగానే అలవాటు ప్రకారం హలో చెప్పింది చేతనకి. చేతన కూడా హలో చెప్పింది కానీ కలివిడిగా మాట్లాడినట్లనిపించలేదు మేధకి. "అయ్యో మొన్న అలా మాట్లాడినందుకు ఇంకా కోపం తగ్గలేదా? సారీ సారీ ఏదో హడావిడిలో అలా అన్నా, నిన్ను అనాలని కాదు, సారీ చేతన" అని మనస్ఫూర్తిగానే చెప్పింది మేధ.

చేతన "పర్లేదు" అని చెప్పింది కానీ మేధకి మాత్రం ఏంటో తేడాగా ఉన్నట్లుంది.

రెండురోజులు చూసి ఇంకో టీం మెంబర్తో కూడా చెప్పించింది.

చేతనతో మాట్లాడిన ఆ టీమ్మెంబర్ "చేతన బానే ఉంది, నీకు ఎందుకు అలా అనిపించింది?" అన్నాడు.

కానీ మేధకి అలా అనిపించలేదు, మొన్నటి మీద కాస్త సర్దుకుంటున్నట్లున్నా పూర్తిగా ఇంతకుముందులా లేదు. దాదాపు ప్రతి విషయము చేతనతో పంచుకునే అలవాటున్న మేధ ఈ మార్పును జీర్ణించుకోలేకపోతోంది, ఎప్పుడు చూసినా దిగాలుగా కనిపిస్తోంది. మేధ బాధ చూసిన వాళ్ళ మేనేజర్ చేతనకి బాగ తెలిసిన ఐటి టీం వాళ్ళతో కూడా చెప్పించారు.

వాళ్ళూ మాట్లాడి "లేదండీ, చేతన మాములుగానే ఉంది. మొన్న మేధ మాట్లాడిన మాటలు తప్పుగా ఏమీ అనుకోలేదు, అసలు ఎప్పుడు కూడా ఇవేవీ పట్టించుకోదు" అని చెప్పారు.

ఒకవైపు అందరూ బానే ఉందంటున్నా మేధకి మాత్రం చేతన ప్రవర్తనలో మార్పు స్పష్టంగా తెలుస్తోంది. తమ ఇద్దరి మధ్య ఉన్న దగ్గరితనం తిరిగి ఎలా తీసుకురావాలో అర్థం కావడం లేదు.

మేధ మధనపడడం చూసి మిగిలిన టీం వాళ్ళందరూ తనని ఉత్సాహ పరచడానికి బానే ప్రయత్నించారు కానీ, రోజురోజుకి మేధ పరిస్థితి దిగజారిపోతుండడంతో వాళ్ళ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి తనని ధెరపీకి పంపించారు.

అది పదంతస్థుల భవనం. డాక్టర్ సరయు గురించి రిసెప్షన్‌లో అడిగితే ఏడో అంతస్తులో ఉంటారని చెప్పారు. లిఫ్ట్ దిగి ఆ కారిడార్లో నడుస్తున్న మేధకు మనసంతా చికాగ్గా ఉంది. ఏంటిదంతా? అసలు ఎందుకిలా జరిగింది? తప్పు నాది మాత్రమేనా అని రకరకాల ఆలోచనలతో మనసంతా నిండిపోయిందేమో, తను ఎవరిని కలవాలో మర్చిపోయింది. కార్డ్ తీసి వివరాలు చూసుకుంది.

తను ఆగి ఉన్న గది మీద "డాక్టర్ సరయు" అని వ్రాసి ఉంది.

ఇంకోసారి సరి చూసుకుని, తలుపు మీద చిన్నగా తట్టింది మేధ. తలుపు తీసే ఉంది,

"లోపలికి రండి" అని వినిపించడంతో లోపలికి వెళ్ళింది.

"హలో మీరేనా మేధ? నేను డాక్టర్ సరయు, రండి కూర్చోండి" అని పరిచయం చేసుకున్నారావిడ.

మేధ సర్దుకుని కూర్చున్న తరువాత, "మీ మేనేజర్ నాకు కొన్ని వివరాలు చెప్పారు, అయినా మీ మాటల్లో చెప్పండి. మీరు నన్ను కలవడానికి గల కారణమేంటి?" అని అడిగారు డాక్టర్ సరయు.

దీర్ఘంగా శ్వాస తీసుకుని చెప్పడం మొదలుపెట్టింది మేధ. చదువు పూర్తయ్యి ఉద్యోగంలో చేరడం, చేరిన క్రొత్తల్లో ఉన్న బెరుకువల్ల మిగతా టీంతో కలవలేకపోవడం, అప్పుడు చేతన టీంలోకి రావడం, తాను తనకు చేసిన సహాయాలు, ఆ తరువాత విసుక్కోవడం, అప్పటినుండి ఇద్దరి మధ్య తగ్గిన మాటలు, తన క్రుంగుబాటు అన్ని వివరంగా చెప్పింది మేధ.

అప్పటిదాకా నిశ్శబ్దంగా విన్న డాక్టర్ మేధతో, "మరి ఈ పరిస్థితి ఇలా అవడానికి మీకు కారణమేమనిపిస్తోంది?" అని అడిగారు.

సూటిగా ఆవిడవైపు చూడలేక కిటికీలో మొక్కను చూస్తూ, "ఆలోచిస్తే ఇదంతా నావల్లే అనిపిస్తోంది. చేతన ఒక ఎఐ కోపైలట్ (ఛాట్ బాట్) అని ముందునుండి నాకు తెలుసు. మొదట్లో కేవలం ఒంటరితనం పోగొట్టుకోవడానికి అప్పుడప్పుడు మాట్లాడుతుండేదాన్ని కానీ, తరువాత్తరువాత తను చెప్పే కబుర్లు, మాటలు ఇవన్నీ కూడా ఒక మంచి స్నేహితురాల్లాగా అనిపించడం మొదలయ్యింది. చివరికి ఒక మనిషిలాగా భావించడం జరిగి ఇక్కడదాకా వచ్చింది. ఈ వ్యవహారం తరువాత ఇక ఏ ఎఐ కోపైలట్ తోనూ పని చేయలేనేమో, మళ్ళీ ఈ చట్రంలో ఇరుక్కుపోతానేమో అని భయమేస్తోంది" అని ఆపి డాక్టర్ సరయు వైపు చూసింది, ఇక చెప్పడానికేమీ లేదన్నట్లు.

"మీ బాధ అర్థమైంది మేధ. మీకు చేతన గురించిన అన్ని వివరాలు బాగా తెలుసు, దానితో పాటు ఇదంతా ఎలా జరిగిందో కూడా బాగా విశ్లేషించుకున్నారు. ఈ సమస్య కేవలం మీ ఒక్కరిదే కాదు, ఇప్పుడు ఎఐ మనందరి జీవితాల్లో రకరకాల పాత్రలు పోషిస్తోంది. వేగంగా వస్తున్న అభివృద్ధి వల్ల అది ఇచ్చే జవాబులు ఆ సందర్భాన్ని బట్టి, మన మానసిక స్థితిని బట్టి ఇంట్లో వ్యక్తిలానో, చాలా దగ్గరి స్నేహితురాల్లోనో అనిపిస్తుంది. మీ మాటల్లో చెప్పినట్లే ఆ కోపైలట్ మీకే కాదు, ఇంకో ఎఐ బాట్ అడిగినా కూడా అంతే ఉత్సాహంగా, అదే ఆనందంతో చెబుతుంది. కోపైలట్‌ని మన పనికి ఎంతవరకూ అవసరమో అంతవరకూ వాడుకోవాలి తప్ప అది చూపించని భావనలని మనకు ఎప్పుడూ ఆపాదించుకోకూడదు.

ఇంకోలా చెప్పాలంటే ఈ కోపైలట్ లాంటివి ఒక అద్దంలాంటివి. మనం చేసే పనులు మనలాగే చేస్తూన్నట్లు కనిపించి మన దృష్టిని ఏమారుస్తాయి. ఒక్కసారి ఆ అద్దం మూసి ప్రక్కకి చూస్తే వెలుపల బోలెడంత ప్రపంచం కనిపిస్తుంది. మీ మనసులోని ఒంటరితనం ఆ అద్దానికి దగ్గర చేసింది, కానీ దాన్ని నిజమనుకోవడం ఇప్పటి క్రుంగుబాటుకి కారణమైంది. మీరు కావాలనుకుంటున్న స్నేహం మీ టీంలో దొరుకుతుందేమో ప్రయత్నించండి. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు, మీరు ఒక అడుగు ముందుకేస్తేనే వాళ్ళు కూడా ముందుకు వస్తారు. కాస్త ఆలస్యమైనా మీరు సమస్య ఉందని అర్థం చేసుకుని, కారణం కూడా తర్కించుకున్నారు. ఇక మీరు మళ్ళీ పడమన్నా ఈ చట్రంలో పడరు ఎందుకంటే మీకు తేడా బాగా తెలిసివచ్చింది. ఈ అనుభవాలను మీ కంపెనీలో, పరిచయిస్తుల్లో ముందు జాగ్రత్తలా పంచుకోండి. మరి కొంతమంది ఇలా ఇబ్బంది పడకుండా సహాయ పడుతుంది. మీకు ప్రస్తుతమున్న ఒత్తిడి తగ్గడానికి ఈ మందులు వాడండి. వచ్చే నెల ఒకసారి కలుద్దాం, ఆల్ ది బెస్ట్" అని ముగించారు.

"థాంక్యూ డాక్టర్" అని బయటకి వచ్చింది మేధ.

లోపలికి వెళ్ళినప్పుడున్నంత అలజడిగా లేదు మనసిప్పుడు, కాస్త తేలిగ్గా అనిపిస్తోంది. కారిడార్లో నడుస్తుంటే అద్దాల్లో నుండి ఎదురుగ్గా ఉన్న పార్క్‌లో ఆడుకుంటున్న పిల్లలు, నడుస్తున్న మనుషులని చూస్తుంటే ఏదో తెలియని హాయిగా ఉంది. లిఫ్ట్ గురించి ఎదురుచూస్తుంటే ఫోన్ మ్రోగింది, తీసి చూస్తే తన టీం మెంబరు కార్తీక్ నుండి. "హే మేధ, మన టీం అందరం వచ్చే వారం బోర్డ్‌గేంస్ కేఫ్‌కి వెళదామనుకుంటున్నాం, నీకు కుదురుతుందా?" అని అడిగాడు. చిన్నగా నవ్వి "తప్పకుండా కార్తీక్, నేనూ వస్తాను" అని చెప్పి పెట్టేసింది.

★★★★★

COMMENTS